సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



అమ్మో.. చెడ్డీ గ్యాంగ్
అమీన్‌పూర్, లింగంపల్లి పరిసర ప్రాంతంలోని గేటెడ్ కమ్యూనిటీలను లక్ష్యం చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. 8లో..



అపహరణ కాదు.. ఆపద్బాంధవుడు
సదాశివపేటలోని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు ఎస్ఎన్ ఫుడ్‌కోర్టు వద్ద గురువారం ఉదయం కిడ్నాప్ కలకలం సృష్టించింది. 8లో..

'గృహలక్ష్మి'కి 24,359 దరఖాస్తులు
సిద్దిపేటరూరల్: సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకానికి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. 24,359 దరఖాస్తులు అందాయి. నియోజక వర్గాల వారీగా సిద్దిపేట నుంచి 1,879, దుబ్బాకలో 2,934, గజ్వేల్‌లో 11,971, జనగాంలో 3,083, హుస్నాబాద్‌లో 4,492, దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేయనున్నారు.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన టేకేదార్లు



మంత్రి హరీశ్‌రావును కలిసి మొక్క అందిస్తున్న బీడీ టేకేదారులు

కొండపాక(గజ్వేల్): బీడీ టేకేదారులకు ప్రభుత్వం పెన్షన్ సదుపాయాన్ని కల్పించడంతో గురువారం కార్మిక నాయకుడు బాలు ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీడీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ బీడీ సంఘం నాయకులు శోభన్, ఐలారెడ్డి, నర్సింహులు, టేకేదార్లు పాల్గొన్నారు.

కేసులను సత్వరం పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటమూస్: అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి పెండింగ్ కేసులు ఛేదించాలని పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. సిద్దిపేట డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై గురువారం సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీటీఎన్ఎస్‌లో ప్రతి ఫైల్‌కు సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి నెల 20లోపు కేసుల విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలని సూచించారు. రౌడీలు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. నూతన టెక్నాలజీని అధికారులు అందిపుచ్చుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, సిద్దిపేట ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్‌బీ ఏసీపీ రవిందర్‌రాజు, సీసీఆర్‌బీ ఏసీపీ చంద్రశేఖర్, సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా రచయితల సంఘం (సిరసం), శ్రీవాణి సాహిత్య పరిషత్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సిరసం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రారెడ్డి రచించిన శ్రీ పంచముఖ వీరాంజనేయ శతకం, పెందోట వెంకటేశ్వర్లు రచించిన గెలుపుల ప్రసాదం పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ సామ సువర్ణదేవి, డాక్టర్ దశరథుల బాలయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.

కదంతొక్కిన ఆశావర్కర్లు

- వేతనాలు పెంచాలని డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిద్దిపేటరూరల్: వైద్య సేవల్లో పనిచేస్తున్న ఆశావర్కర్లకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలను అందించాలని ఆశావర్కర్ల జిల్లా గౌరవ అధ్యక్షుడు మంచె నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నర్సింహులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా కనీస వేతనాలు అందించడంలేదన్నారు. వేతనాలు పెంచి, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఆశా అధ్యక్షురాలు లక్ష్మి, ప్రధాన కార్యదర్శి కనకవ్వ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివస్తున్న ఆశావర్కర్లు

803 మంది వీఆర్ఏలు రిలీవ్

270 మందికి కేటాయించని పోస్టింగ్

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ జీఓ విడుదల చేసిన క్రమంలో జిల్లా వ్యాప్తంగా గురువారం 803 మంది వీఆర్ఏలు రిలీవ్ అయ్యారు. 1,073 మంది వీఆర్ఏలు రెగ్యులర్ కాగా వీరిని 18 శాఖలకు కేటాయించారు. గురువారం రోజు రిలీవ్ అయిన వీఆర్ఏలు 311 మంది రెవెన్యూ విభాగానికి, 250 నీటిపారుదల శాఖ విభాగానికి, 146 మంది మిషన్ భగీరథ ఇతర శాఖల్లో విధులు నిర్వహించేందుకు కేటాయించారు. అదేవిధంగా 61 ఏళ్లు దాటిన వారి వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకా 270 మందికి పోస్టింగ్‌లు కేటాయించలేదు. వీఆర్ఏల విద్యార్హతను ఆధారంగా రికార్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లు, ఆఫీస్ సబార్డినేట్‌లుగా పోస్టింగ్‌లను కేటాయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగాల్లో రిపోర్టు చేసి విధులు నిర్వహించనున్నారు.

అడవులు మురిసె.. వన్యప్రాణులు మెరిసె

అడవులకు మునుపటి రోజులు వచ్చాయి. వన్యప్రాణుల సందడి పెరిగింది. చాలా కాలంగా కనిపించకుండాపోయిన కొండగొర్రెలు, తోడేళ్లు, హైనాలే కాకుండా కుందేళ్లు, నెమళ్లు, కోతులు ఇలా ఒకటేమిటీ అన్ని రకాల వన్యప్రాణులు విరివిగా తిరుగుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో చేపట్టిన వినూత్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన ఫలితాలివి. గజ్వేల్ రాష్ట్రానికే మోడల్‌గా మారింది.

ఉట్టిపడుతున్న జీవవైవిధ్యం

- నెమళ్లు, కొండగొర్రెలు, తోడేళ్లు, హైనా, కుందేళ్ల సంచారం
- వినూత్న పథకాలతో మెరుగైన ఫలితాలు
- రాష్ట్రానికే మోడల్‌గా నిలిచిన గజ్వేల్ ప్రాంతం



గజ్వేల్ అటవీ శాఖ రేంజీ పరిధిలో కెమెరాల్లో ఇటీవల రికార్డయిన వన్యప్రాణుల దృశ్యాలు

గజ్వేల్: అటవీశాఖ రేంజి పరిధిలోని ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, గజ్వేల్, వర్గల్ మండలాల్లో 7,386 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. నర్సంపల్లి, సింగాయపల్లి, కోమటిబండ, రంగంపేట అటవీ ప్రాంతాల్లో 2,287 హెక్టార్లలో సహజ అడవుల పునరుత్పత్తి (యాడెడ్ నేచురల్ రీ–జనరేషన్), కృత్రిమ అడవుల పునరుత్పత్తి (ఏఆర్) పథకాల ద్వారా పెద్ద ఎత్తున మొక్కలను పెంచి మంచి ఫలితాలను తీసుకువచ్చారు. అయిదేళ్ల క్రితం ఈ కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రత్యక్షంగా పరిశీలించి తమ జిల్లాల్లో అమలు చేసే విధంగా చొరవ చూపాలని సీఎం ఆదేశించగా... కలెక్టర్లంతా ఇక్కడ పర్యటించిన సంగతి తెలిసిందే. 2019 ఆగస్టు 21న కూడా సీఎం కేసీఆర్... మంత్రులు, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ల బృందంతో మరోసారి పర్యటించి కోమటిబండలోని మిషన్ భగీరథ హెడ్ వర్క్స్ వద్ద రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమయంలో సింగాయపల్లి అడవిని సందర్శించిన సీఎం అడవి మధ్య ఖాళీ ప్రదేశాలు కనిపించడం చూసి అక్కడ కూడా మొక్కలు నాటి అడవి సాంద్రత పెంచాలని ఆదేశించారు. అదే విధంగా వనాలను వదిలి జనావాసాల్లో తిరుగుతున్న కోతులు తిరిగి అడవుల మార్గం పట్టే విధంగా మంకి ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం ఫలాలు ఇచ్చే అడవిజాతి మొక్కలను నాటాలని నిర్దేశించారు. దీంతో అటవీశాఖ అధికారులు కొత్త విధానాలపై అధ్యయనం జరిపారు. జపాన్‌లో మియావాకీ అనే శాస్త్రవేత్త కొన్నేళ్ల క్రితం ప్రవేశపెట్టిన విధానాన్ని అమలు చేశారు. ఇందులో భాగంగానే అడవి మధ్య భాగంలో ఖాళీగా ఉన్న 5 హెక్టార్ల భూమిని ఎంపిక చేసి అడవి సాంద్రతను పెంచారు. సాధారణ పద్ధతిలో అయితే 50 హెక్టార్లలో నాటే 50వేల మొక్కలను నాటుతారు. కానీ 50వేల మొక్కలను 5హెక్టార్లలోనే నాటడమే 'మియావాకీ' విధానం ప్రత్యేకత. మొక్కకు మరో మొక్కకు మధ్య మీటర్ దూరం మాత్రమే వదిలి మొక్కలను నాటుతారు.

సంఖ్య పెరిగింది

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక్కడ వినూత్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకుసాగుతున్నాం. ఏఆర్, ఏఎన్ఆర్ పథకాలతో అడవులకు మునుపటి రోజులు వచ్చాయి. ప్రస్తుతం అడవుల్లో వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. ఇక్కడ జరుగుతున్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలను వివిధ ప్రాంతాల వారు సందర్శనకు వచ్చి ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

– కిరణ్‌కుమార్, గజ్వేల్ ఫారెస్ట్ రేంజి అధికారి

కోమటిబండలో కొత్త అడవి సృష్టి

వినూత్నంగా సాగుతున్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలకు గజ్వేల్ మండలం కోమటిబండ ప్రత్యక్ష నిదర్శనం. కోమటిబండలోని గుట్ట చుట్టూ 2.5 కిలోమీటర్ల ప్రాంతంలో కృత్రిమ అడవుల పునరుత్పత్తి (ఏఆర్) పథకం ద్వారా కొత్త అడవిని సృష్టించారు. పచ్చదనం విధ్వంసమైన ఈ ప్రాంతంలో నెమళ్లు, ఇతర వన్యప్రాణులు రోడ్ల పైకి వచ్చి వందల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. ఈ పరిస్థితిని మార్చడానికి 2015–16లో 77 హెక్టార్లు, 2016–17లో 215 హెక్టార్లు, 2017–18లో 200హెక్టార్లు, 2018–19లో 110 హెక్టార్లలో, 2019–20లో మరో 100హెక్టార్లలో..ఒక్కో హెక్టారుకు 1660 మొక్కల చొప్పున కోటి మొక్కలను నాటి కొత్త అడవిని సృష్టించారు. ఈ అడవుల్లో అల్లనేరేడు, రావి, మర్రి, జువ్వి, తానీ, కర, సీత ఫలం, వేప, కరక, ఏగిసా, చిందుగా, తదితర రకాల పండ్లనిచ్చే మొక్కలను విస్తృతంగా పెంచారు. దీని వల్ల ప్రస్తుతం ఈ అడవుల్లో చాలా కాలంగా కనిపించకుండాపోయిన వన్యప్రాణులు విరివిగా తిరుగుతున్నాయి. వీటికి నీటిని అందుబాటులో ఉంచేందుకు సాసర్లను నిర్మించారు. వన్యప్రాణుల కదలికలను గమనించేందుకు నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఇక్కడే కాదు...



గజ్వేల్ ఫారెస్ట్ రెంజీ పరిధిలోని అన్ని అడవుల్లోనూ గతంతో పోలిస్తే వన్యప్రాణుల సందడి పెరిగింది.

గొల్ల కురుమల సంక్షేమానికి ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



చంద్లాపూర్‌లో గొర్రె పిల్లలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని చంద్లాపూర్‌లో రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొల్ల కురుమల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించిందన్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.1.75 లక్షల యూనిట్ విలువతో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం చైర్మన్ శ్రీహరి యాదవ్, వెటర్నరీ జేడీ జగత్ కుమార్ రెడ్డి, రైతు బంధు జిల్లా సభ్యులు వెంకటేశం, సర్పంచ్ చంద్రకళ రవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఇప్పటి వరకు 107 'మద్యం' దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 107 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. సిద్దిపేట సర్కిల్‌లో 31, గజ్వేల్ సర్కిల్‌లో 55, హుస్నాబాద్ సర్కిల్‌లో 14, చేర్యాల సర్కిల్‌లో 06, మిరుదొడ్డి సర్కిల్‌లో ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు.

మందుబాబుల హల్‌చల్

- వైన్‌షాపుల ఎదుట, ఫుట్‌పాత్‌లపైనే తాగుతుండటంతో ఇబ్బందులు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం
- దారిగుండా వెళ్లే మహిళలు, విద్యార్థినులకు తప్పనితిప్పలు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు



రోడ్డు పక్కనే మద్యం తాగుతున్న మందుబాబులు



వైన్ షాపు పక్కనే ఉన్న టీ స్టాల్ వద్ద మద్యం సేవిస్తూ..

సిద్దిపేటకమాన్: పట్టణంలోని పలు వైన్ షాపుల ఎదుట, ఫుట్‌పాత్‌ల వద్ద మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. పర్మిట్ రూమ్‌లు ఉన్నప్పటికీ రోడ్డుపైనే మద్యం తాగుతూ మత్తులో తూగుతున్నారు. ప్రధానంగా రోడ్లను ఆనుకొని ఉన్న వైన్‌షాపుల వద్ద మహిళలు, విద్యార్థినులు, యువతులకు భద్రత కరువవుతోంది. సిద్దిపేటలోని మద్యం దుకాణాలను 'సాక్షి' గురువారం రాత్రి పరిశీలించింది. పట్టణంలోని ప్రధాన రోడ్ల పక్కనే ఉన్న మద్యం దుకాణాల వల్ల సాయంత్రం నుంచి రాత్రి షాపులు మూసివేసే వరకు మందుబాబులు, వారి వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సిద్దిపేట–నర్సాపూర్ చౌరస్తాలోని మద్యం దుకాణాల ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌ల పైన కూర్చుని మందుబాబులు మద్యం తాగుతున్నారు. రోడ్డు వెంట వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. టీస్టాళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో కూర్చుని మద్యం సేవిస్తున్నారు. అలాగే మద్యం కొనుగోలు కోసం వచ్చే వారు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్క్ చేయడంతో పాదచారులకు, ఇతర వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బయట మద్యం సేవించకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



మద్యం దుకాణాల ఎదుట రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాలు

గజ్వేల్ కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ

- భగ్గుమన్న విభేదాలు
- ప్రజ్ఞాపూర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ, పలువురికి గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు, కేసు నమోదు



ప్రజ్ఞాపూర్‌లో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ వర్గాలు

గజ్వేల్: కాంగ్రెస్‌లో మరోసారి విభేదాలు రచ్చకెక్కి ఘర్షణ చోటు చేసుకున్నది. గజ్వేల్‌లో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గురువారం ఇరువర్గాల మధ్య జరిగిన గొడవతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ రాకకోసం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఆయన వర్గీయులు ప్రజ్ఞాపూర్‌లోని హరిత హోటల్ సమీపంలో నిరీక్షిస్తున్నారు. పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశానికి విశ్వనాథ్ హాజరుకావాల్సి ఉంది. ఇదే క్రమంలో నర్సారెడ్డి వ్యతిరేక వర్గీయులు పీసీసీ ప్రతినిధులు జశ్వంత్‌రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో మమతారెడ్డి, భానుప్రకాష్‌రావు తదితరులు అక్కడికి చేరుకున్నారు. వీరు గతనెల 7న నర్సారెడ్డికి వ్యతిరేకంగా గాంధీభవన్ వద్ద ధర్నా చేపట్టి పార్టీ ముఖ్య నేతలకు ఫిర్యాదులు కూడా చేశారు. ఇదే క్రమంలో రెండు వర్గాలు ఒకేచోట చేరడంతో గాంధీ భవన్ ఫిర్యాదుల అంశంపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరినొకరు తోసుకోవడం, పిడిగుద్దులకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొన్నది. ఈ సందర్భంగా పలువురు నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి. తనపై నర్సారెడ్డి వర్గీయులు దాడిచేసి చితకబాదారని బండారు శ్రీకాంత్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. ఆ తర్వాత నర్సారెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ గజ్వేల్ పట్టణశాఖ అధ్యక్షుడు మొనగారి రాజు సైతం పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా జశ్వంత్‌రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు, భానుప్రకాష్‌రావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ నర్సారెడ్డి తీరుపై మండిపడ్డారు. మండల కమిటీల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్న అంశంపై ప్రశ్నించినందుకే తమపై కక్ష పెంచుకొని దాడులకు ఉసిగొల్పారని ఆరోపించారు.

స్థానికులకే టికెట్

ఏఐసీసీ కార్యదర్శి వీసీ విశ్వనాథ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికులకే పార్టీ టికెట్ అందించనున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి, మెదక్ పార్లమెంటరీ ఇన్‌చార్జి వీసీ విశ్వనాథ్ అన్నారు. గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. పార్టీ కోసం పని చేస్తున్న స్థానిక నాయకులకే పార్టీ టికెట్ ఇవ్వాలని సీనియర్ నాయకులు ఏకగ్రీవం తెలుపుతూ విష్ణునాథ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణునాథ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్త, నాయకుడిని అధిష్టానం గుర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, పీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, టీపీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

• తీజ్ సంబురం



గిరిజనుల తీజ్ ఉత్సవాలు బుధవారం జిల్లెలగడ్డలో ఘనంగా జరిగాయి. గిరిజన యువతులు తొమ్మిది రోజులు ప్రకృతికి జలాభిషేకాలు చేస్తారు. చివరి రోజు తండా పెద్దల ఆశీర్వాదం తీసుకుని బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. ఇలా చేస్తే తమ కోరికలు నెరవేరుతాయని వారి నమ్మకం. వలస వెళ్లిన వారు సైతం తిరిగి రావడంతో తండాల్లో సందడి నెలకొంది.

– హుస్నాబాద్‌రూరల్

• ఆదాయం అబ్బురం



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ డబ్బులు లెక్కించారు. 76 రోజులలో రూ. 90,21,539 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఈఓ రవికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూ. 90,21,539, విదేశీ కరెన్సీ నోట్లు 26, మిశ్రమ బంగారం 99 గ్రాములు, వెండి 10 కిలోల 200 గ్రాములు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

– కొమురవెల్లి (సిద్దిపేట)

క్లుప్తంగా

12న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

గజ్వేల్‌రూరల్: ఈనెల 12న గజ్వేల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయనున్నట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా జాయింట్ సెక్రటరీ నాగేష్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని పెబ్బేరులో ఈనెల 16 నుంచి 19 వరకు పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుందని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో 12న ఉదయం 9 గంటలలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9908789877 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మంజీర నదిలో గల్లంతు

పాపన్నపేట(మెదక్): పశువులను మేతకు తీసుకెళ్లిన యువకుడు మంజీర నదిలో గల్లంతయ్యాడు. ఈసంఘటన మండల పరిధిలోని కొడుపాక శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడుపాకకు చెందిన భూమేష్ అదే గ్రామానికి చెందిన సంగయ్య వద్ద పశువులు మేపేందుకు పాలేరుగా కుదిరాడు. రోజూ మాదిరిగానే బుధవారం సాయంత్రం గేదెలు మేపుతూ మంజీర తీరానికి వెళ్లాడు. పశువుల నీరు తాపేందుకు నదిలోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గమనించిన సహచర పాలేరు పాపయ్య రాత్రి గ్రామస్తులకు చెప్పాడు. కుటుంబీకులు, గ్రామస్తుల సహాయంతో పోలీసులు మంజీర నదిలో వెతికారు. కానీ గురువారం రాత్రి వరకు భూమేష్ జాడ తెలియరాలేదు.

గుర్తు తెలియని వాహనం ఢీ: జింక మృతి


జింక కళేబరం

హవేళీఘనపూర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని శాలిపేట గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. శాలిపేట అటవీ ప్రాంతం నుంచి జింక రోడ్డుపైకి రాగా మెదక్ వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వెటర్నరీ అధికారి లక్ష్మణ్ పంచనామా నిర్వహించి మెదక్ వెటర్నరీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎఫ్‌ఆర్‌ఓ మనోజ్‌కుమార్ తెలిపారు.

చెన్నైలో సిద్దిపేట విద్యార్థి మృతి


పవన్(ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేటకు చెందిన ఓ విద్యార్థి చెన్నైలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన దాసరి రాజు, స్వప్న దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు సంతానం. రాజు దుబ్బాకలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కూతురు స్థానికంగా సిద్దిపేటలో 8వ తరగతి చదువుతుండగా.. కుమారుడు పవన్ (18) చెన్నైలోని ఓ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా బుధవారం సాయంత్రం నలుగురు స్నేహితులతో కలిసి పవన్ బయటకు వెళ్లాడు. స్థానికంగా ఆ ప్రాంతంలో పక్కనే ఉన్న చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తోటి స్నేహితులు సిద్దిపేటలోని పవన్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించగా.. వారు వెంటనే చెన్నై బయలుదేరి వెళ్లారు. హాస్టల్ నిర్వాహకులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చెరువులో పవన్ మృతదేహాన్ని గుర్తించి స్థానిక ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని స్థానిక పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సిద్దిపేటకు తీసుకురానున్నట్టు వారు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788615]

WANTED
■ ఆంధ్రప్రదేశ్‌లో న్యూ బ్రాంచ్ ఆఫీసులో వర్క్ చేయుటకు టీమ్‌లీడర్స్, రిటైర్డ్ గృహిణులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు అర్జెంటు జాయిన్. P/T 18,500/-, F/T 23,500. Cont: 6301174077 [G-786540]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ద్వారా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అమ్మో.. చెడ్డీ గ్యాంగ్!

- వణుకుతున్న కాలనీలు
- వేటలో పోలీసులు



సీసీ ఫుటేజ్‌లో నమోదైన దృశ్యం

పటాన్‌చెరు: చెడ్డీ గ్యాంగ్ కాలనీవాసుల్లో దడ పుట్టిస్తోంది. వారం రోజుల క్రితం అమీన్‌పూర్ శివారులోని ప్రణీత్ హోమ్స్‌లో జరిగిన దొంగతనం కలకలం రేపింది. చెడ్డీలు వేసుకున్న కొందరు అమీన్‌పూర్ పట్టణంలోని పలు కాలనీలో సంచరిస్తున్నట్టు సీసీ కెమెరాల్లో గుర్తించారు. 2022 మార్చి, ఏప్రిల్‌లోనూ ఈ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఇప్పటివరకు ఆ గ్యాంగ్‌లోని ఏ ఒక్కరిని పోలీసులు గుర్తించలేదు. తాజాగా మళ్లీ దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

గేటెడ్ కమ్యూనిటీలే లక్ష్యం..

అమీన్‌పూర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న దొంగలు ఎవరనేది నేటికీ వెల్లడి కాలేదు. అయితే ఇటీవల బీరంగూడ ప్రణీత్ హోమ్స్‌లో జరిగిన చోరీని పరిశీలిస్తే తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేశారని తెలుస్తోంది. అది కూడా ముందుగా తమకు అందిన సమాచారం మేరకే ఆ ఇళ్లలో చోరీకి పాల్పడినట్టు సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఈ కాలల్లో పనిచేసిన వారు, పరిసరాలు తెలిసినవారే దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. అయితే కొందరు నేరస్తులు అమీన్‌పూర్‌లో తలదాచుకుంటున్నారని గతంలో జరిగిన కొన్ని కేసుల్లో గుర్తించారు. రాయలసీమ ప్రాంతంలో ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడు పోలీసులు కళ్లు గప్పి అమీన్‌పూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీలో స్థిరపడ్డాడు. అతడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. మరో సంఘటనలో కొద్దిరోజుల క్రితం ఇద్దరి మహిళలను అపహరించి ఇక్రిశాట్ కాలనీలోని ఓ ఇంట్లో దాచి ఉంచారు. వారి అరుపులు విని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే ఈ ప్రాంతంలో నేరస్తులు ఆశ్రయం పొందుతున్నారని తెలుస్తోంది. కొన్నిసార్లు 100కు ఫోన్ చేసినా స్పందన కరువైందని అమీన్‌పూర్ వాసులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట పోలీసులు వాహనాలు సంచరించడం లేదని చెబుతున్నారు.

కాలనీల్లో గస్తీ పెంచాం

అమీన్‌పూర్ పరిధిలో దొంగలు సంచరిస్తున్న నేపథ్యంలో గస్తీ పెంచాం. గేటెడ్ కమ్యూనిటీలతో పాటు వివిధ కాలనీల సెక్యూరిటీని అప్రమత్తం చేస్తున్నాం. అపరిచిత, కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించాం. ప్రణీత్, ప్రణవ్ పనోరమలో చోరీకి పాల్పడిన వారిపై నిఘా ఉంచాం. త్వరలోనే వారిని పట్టుకుంటాం.

– శ్రీనివాసులురెడ్డి, అమీన్‌పూర్ సీఐ

మద్యం మత్తులో ఘర్షణ

చిన్నాన్ననే చంపిన కొడుకు


హత్యకు గురైన యాదయ్య

అల్లాదుర్గం(మెదక్): మద్యం మత్తులో ఘర్షణ ఒకరి ప్రాణం తీసింది. ఈసంఘటన బుధవారం రాత్రి అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్‌లో చోటు చేసుకుంది. సీఐ జార్జ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరగల్ల యాదయ్య (35) అన్న మొగులయ్య కొడుకు మహేశ్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. వారం రోజుల క్రితం మహేష్ ఫోన్ పోయింది. బుధవారం రాత్రి యాదయ్య, మహేష్‌లు మద్యం సేవించారు. తన ఫోన్ నువ్వే తీసుకున్నావని యాదయ్యతో గొడవపడ్డాడు. మాటా మాట పెరగడంతో ఆగ్రహించిన మహేష్ పక్కనే ఉన్న కర్రతో యాదయ్య తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. యాదయ్య మద్యానికి బానిస కావడంతో భార్య కొడుకుతో కలిసి ఐదేళ్ల క్రితమే పుట్టింటికి వెళ్లి పోయింది. మృతుడి అన్న దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని మెదక్ డీఎస్పీ ఫణేందర్ పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వలే మృత్యుపాశమైంది


చంద్రమౌళి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): చేపలు పట్టే వలే మత్స్యకారుడి పాలిట యమపాశమైంది. ఈఘటన అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని మోతెలో జరిగింది. భూంపల్లి ఏఎస్‌ఐ బిక్యానాయక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొడుగు చంద్రమౌళి (39) పద్మ దంపతులు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. చంద్రమౌళి వృత్తిపరంగా చేపలు పట్టి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం తోటి మత్స్యకారులతో కలిసి గ్రామంలోని ఊరవాణి కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగాడు. గమనించిన తోటి మత్స్యకారులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. గజ ఈతగాళ్లు మూడు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం చంద్రమౌళి మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండో భార్య మోజులో పడి..

మొదటి భార్యను కడతేర్చాడు


స్వరూప (ఫైల్)

మెదక్/హవేళీఘనపూర్: రెండో భార్య మోజులో పడి మొదటి భార్యకు బలవంతంగా పురుగు మందు తాగించాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించాడు. ఆమె ఐదురోజుల పాటు ఆస్పత్రిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి కథనం ప్రకారం.. మెదక్ మండలం తిమ్మక్కపల్లి తండాకు చెందిన కాత్రోత్ రమేశ్‌కు కౌడిపల్లి మండలం మహబూబ్‌నగర్ తండాకు చెందిన స్వరూపను (30) పదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వారికి ఒక బాబు జన్మించాడు. కాగా రమేష్ ఇటీవల తిమ్మక్కపల్లి తండాకు చెందిన మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మొదటి భార్య స్వరూపకు, రమేశ్‌కు తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఎలాగైనా మొదటి భార్యను చంపాలని పన్నాగం పన్నాడు. ఈనెల 6వ తేదీన సాయంత్రం పొలం వద్దకు వెళ్లి వద్దామని తీసుకెళ్లాడు. పథకం ప్రకారం ముందే పురుగు మందు డబ్బా తీసుకొచ్చి బలవంతంగా స్వరూపకు తాగించాడు. అపస్మారక స్థితికి చేరుకోగానే ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి పురుగు మందు తాగిందని చెప్పాడు. అనంతరం ఆమెను మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. రెండో భార్య మంజుల, అల్లుడు రమేష్ వేధింపులకు గురి చేసి తన కూతురును పొట్టనపెట్టుకున్నారని మృతురాలి తల్లిదండ్రులు బోరున విలపించారు. గురువారం సాయంత్రం ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి కాచి.. దోచేశారు

ముగ్గురు అరెస్ట్.. పరారీలో మరొకరు

కొమురవెల్లి(సిద్దిపేట): దారి దోపిడీకి పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. బుధవారం కొమురవెల్లికి చెందిన గొలికర్ లక్ష్మీబాయి తన చిన్న కూతురు శ్యామలను హైదరాబాద్‌లోని అత్తగారి ఇంట్లో దింపి రావడానికి వెళ్లింది. తిరిగి కొమురవెల్లి పాత కామన్ వద్ద రాత్రి బస్సు దిగి గ్రామానికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అందులో డ్రైవర్ తప్ప ఎవరూ లేరు. ఆటో బయలుదేరి పెట్రోల్ పంపు దాటగానే మరో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో ఎక్కారు. వారు లక్ష్మీబాయిని బెదిరించి ఆమె మెడలో పుస్తెల తాడు లాక్కొన్నారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆమె ఆటో నుంచి దూకింది. అరుపులు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి ఆటో డ్రైవర్‌ను పట్టుకోగా మిగితా ముగ్గురు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించగా వారు ఆటో డ్రైవర్‌ను తనిఖీ చేశారు. అతడి వద్ద సుమారు రెండు తులాల బంగారు పుస్తెల తాడు దొరికింది. డ్రైవర్ గణేశ్‌తో పాటు కమ్మరి సాయి కుమార్, ఎర్రారం రమేశ్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు రామకృష్ణ పరారీలో ఉన్నట్టు చెప్పారు.

మద్యం తాగి.. నిద్రలోనే ప్రాణాలు కోల్పోయి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వృద్ధుడు మృతిచెందిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగింది. మహబూబ్‌నగర్‌కు చెందిన జయానంద్ (62) ఉపాధి కోసం విద్యుత్‌నగర్‌కు వచ్చి బంధువుల ఇంట్లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి పడుకున్నాడు. గురువారం బంధువులు అతడి గదికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'విద్యారంగంపై నిర్లక్ష్యం'

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని తపస్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనాకర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అపహరణ కాదు.. ఆపద్బాంధవుడు


యువతిని కారులో ఎక్కిస్తున్న దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు ఎస్‌ఎస్ ఫుడ్ కోర్టు వద్ద గురువారం ఉదయం కిడ్నాప్ కలకలం సృష్టించింది. బైక్ నుంచి యువతిని కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారని కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంగారెడ్డి డీఎస్పీ రమేష్ ఆదేశాల మేరకు అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఫుడ్ కోర్టు వద్ద గల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బైక్ సదాశివపేట మండలం నిజాంపూర్‌కు చెందిన వ్యక్తిదిగా.. కారు పుల్‌కల్ మండలం సింగూర్‌కు చెందినదని గుర్తించి విచారించారు. నిజాంపూర్‌కు చెందిన ఓ యువతి పురుగు మందు సేవించడంతో గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై యువతిని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. యువతి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో స్నేహితుడి కారులో యువతిని ఎక్కించి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో యువతి కోలుకుంటుందని పోలీసులు తెలిపారు. కిడ్నాప్ కాదని యువతి ప్రాణాలు కాపాడేందుకు కారును స్పీడ్‌గా తీసుకెళ్లారని సీఐ నవీన్‌కుమార్ స్పష్టం చేశారు.

నేర ప్రవృత్తే అతడి వ్యసనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

- కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో గంజాయి విక్రేత అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

కొడంగల్: కొడంగల్‌లో గంజాయిని విక్రయించేందుకు యత్నించిన నిందితుడిని మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్సు సిబ్బంది, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొడంగల్ సీఐ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ (50) రెండు సంవత్సరాలుగా ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తెచ్చి జహీరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. గతంలో ఇతడిపై గంజాయి కేసుతో పాటు దొంగతనం వంటి పలు కేసులు నమోదైయినట్లు ఎస్పీ తెలిపారు. ఇటీవల ఒడిశాలో 11 కిలోల (6 ప్యాకెట్లు) గంజాయిని కొనుగోలు చేసి శాఖాపూర్‌కు తీసుకువచ్చాడు. ఆ గంజాయిని విక్రయించేందుకు బుధవారం శాఖాపూర్ నుంచి బైక్‌పై కొడంగల్‌కు బయలుదేరాడు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, కొడంగల్ పోలీసులు మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామం వద్ద నిందితుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించాడు. పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకొని అరెస్టు చేశారు. పూర్తి విచారణ అనంతరం నిందితుడిపై కొడంగల్ పీఎస్‌లో పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. యువత వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని కపూర్‌నాయక్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని పూసల తండాకు చెందిన బదావత్ పార్వతి (19) ఆరు నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుంది. ఈనెల 8వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె గడ్డి మందు తాగింది. ఇంటి పక్కనే ఉన్న తన చెల్లెలు గమనించి తండ్రికి ఫోన్‌లో సమాచారం చేరవేయగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులో బుధవారం సాయంత్రం ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన దరిపల్లి కనకయ్య (60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పోషవ్వ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

క్షణికావేశం.. చిన్నాభిన్నం

వేర్వేరు సంఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..


రాజశేఖర్ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పందిల్లలో గురువారం జరిగింది. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోగుల మల్లేశం, భాగ్యమ్మకు నలుగురు కుమారులు. ఇద్దరికి వివాహాలు కాగా.. చిన్న కొడుకు రాజశేఖర్ (26) బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ తల్లితో కలిసి జీవిస్తున్నాడు. పని దొరకకపోవడంతో షాపు కిరాయి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో రాజశేఖర్ గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. 8 ఏళ్ల క్రితం అనారోగ్యంతో తండ్రి మల్లేశం మరణించగా.. నాలుగేళ్ల క్రితం మూడో కుమారుడు నాగరాజు హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కుమారుడు సైతం ప్రాణాలు తీసుకోవడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది.

మద్యానికి బానిసై..


శ్రీశైలం (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన శ్రీశైలం (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఉండడాన్ని గమనించిన కొందరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..


రాజేష్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కుటుంబ కలహాలతో యువకుడు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మిరుదొడ్డి లింగుపల్లి కూడవెల్లి వాగు హైలెవల్ బ్రిడ్జి వద్ద గురువారం జరిగింది. దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ కథనం ప్రకారం.. దుబ్బాక మండలం ధర్మాజీపేటకు చెందిన గంగిశెట్టి రాజేష్ (37) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ మండల పరిధిలోని మల్లుపల్లిలో తన భార్య లావణ్యతో కలిసి ఉంటున్నాడు. పిల్లలు లేకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ కలహాలు మొదలయ్యాయి. దీంతో ఇటీవల సిద్దిపేటకు మకాం మార్చారు. అక్కడ కూడా గొడవలు చోటు చేసుకోవడంతో రెండు రోజుల క్రితం రాజేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం మిరుదొడ్డి లింగుపల్లి శివారు కూడవెల్లి వాగుపై ఉన్న హైలెవల్ బ్రిడ్జి వద్దకు చేరుకున్న రాజేష్ తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో మండల పరిధిలోని మల్లుపల్లిలో ఉంటున్న వారి దగ్గరి బంధువైన బాలరాజుకు సమాచారం అందించారు. అతడిని గమనించిన రాజేష్ హైలెవల్ బ్రిడ్జిపై నుంచి వాగులోకి దూకాడు. ఏమి చేయాలో తోచని బాల్‌రాజు తేరుకుని కేకలు వేశాడు. గ్రహించిన స్థానికులు రాజేష్‌ను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, ఎస్‌ఐ గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో వాగులో నుంచి రాజేష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యాపారంలో నష్టపోయి..

దుబ్బాకటౌన్: వ్యాపారంలో పెద్ద ఎత్తున నష్టపోవడంతో అప్పులపాలయ్యాడు. తీర్చే మార్గం లేక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన దుబ్బాక పట్టణంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన రంగారోల్ల సుదర్శన్ కుమారుడు శ్రీకాంత్ (31) హోటల్ వ్యాపారంలో రూ. 10 లక్షలకు పైగా నష్టపోవడంతో సిద్దిపేటలో ఉన్న ప్లాటును అమ్మి కొంత వరకు అప్పులు చెల్లించాడు. హోటల్ మూసివేసి రెండేళ్ల క్రితం కుటుంబంతో కలిసి సిద్దిపేట నుంచి దుబ్బాకకు వచ్చారు. ఇక్కడే తల్లిదండ్రులు కూలిపనులు చేస్తుండగా శ్రీకాంత్ ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పుట్టింటి వారికి చెప్పుకోలేక.. అత్తింటి వారిని ఎదిరించలేక..


శ్రీలత (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. ఈ సంఘటన మండల పరిధిలోని షాద్‌నగర్ (గట్‌పల్లి)లో గురువారం జరిగింది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగానం శ్రీలత (21)ను ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన సిరూర్ రవి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్ది రోజులుగా శ్రీలతను పుట్టింటి నుంచి కట్నం తీసుకురావాలని భర్త రవితో పాటు అత్తమామలు వేధించడం మొదలుపెట్టారు. వేరే కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుందనే కోపంతో శ్రీలత తల్లిదండ్రులు ఇంటికి దూరం పెట్టారు. వేధింపులు ఎక్కువ కావడంతో పుట్టింటి వారికి చెప్పుకోలేక.. అత్తింటివారిని ఎదురించలేక ఈనెల 8న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో వివాహిత..


కల్పన మృతదేహం

రాయపోలు(దుబ్బాక): అనారోగ్యంతో మనస్తాపానికి గురై వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ద్యావనమైన కల్పన (28) కొంతకాలంగా కడుపునొప్పి, చాతిలో మంటతో బాధపడుతుంది. పలుమార్లు చికిత్స చేయించుకున్నా తగ్గ లేదు. బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులకు వెళ్లొచ్చిన తర్వాత మరోసారి తీవ్ర కడుపు నొప్పి రాగా భర్త స్వామికి ఫోన్ చేసి చెప్పింది. అతడు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఇంటికి వచ్చేలోగానే పురుగు మందు తాగింది. వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులున్నారు. తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.